క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



నెక్కొండ : గర్భస్థ, పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, ఎవరైనా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ బి.సాంబశివరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఉపేందర్ ఆస్పత్రి, రోహిణి ఆస్పత్రి, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో గురువారం ఆయన తనిఖీలు చేపట్టి మాట్లాడారు. ప్రైవేట్ క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, ఆస్పత్రులు నడిపే వారు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని క్లినిక్‌లు. పాలీక్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఆస్పత్రులు, వెల్‌నెస్ సెంటర్లు, ఫిజియోథెరపీ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో అపరాధ రుసుముతోపాటు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆర్‌ఎంలు, పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోవడం సరికాదని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇంజక్షన్లు, సెలైన్లు పెట్టరాదని, అల్లోపతి వైద్యం చేయరాదని స్పష్టం చేశారు. పీహెచ్‌సీ వైద్యుడు సుమన్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, పీహెచ్ ఎన్‌లు అరుణ, వరమ్మ, సీసీ నాగరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి



గీసుకొండ : ఆంజనేయస్వామి ఆలయంలో పూజ చేస్తున్న మాలధారులు, భక్తులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఖానాపురం, నెక్కొండ, గీసుకొండ, సంగెం, తదితర మండలాల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీసుకొండలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్తలు ఆనంద్ సా, కుమార్ సా ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ మాలధారులు భద్రాచలం, కొండగట్టు, తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో మాలవిరమణ చేశారు. ఖానాపురంలోని ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎస్సై రఘుపతి, తదితరులు పూజలు చేశారు.

వర్షానికి కూలిన ఇళ్లు

ఖానాపురం : అకాల వర్షంతో మండలవ్యాప్తంగా ప్రజలు ఇబ్బంది పడ్డారు. ధాన్యం తడిసింది. మండలంలోని బాల్‌తండాలో గుగులోతు శంకర్, గుగులోతు మంగిలకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. పలు గ్రామాల్లో ఇండ్ల గోడలు నేలకూలాయి. కూలిన ఇండ్లను ఆర్‌ఐ స్వామి పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

రాస్తారోకో

నల్లబెల్లి : దళితుడిపై దాడికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ మాట్లాడారు. మండలంలోని రాంతీర్థం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కలకోటి స్వామి వ్యవసాయ భూమి దున్నేందుకు వెళ్లగా ఎల్లబోయిన అనిల్, రవి కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డట్టు తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై గోవర్ధన్ ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు.

మాజీ సర్పంచ్ మృతి

పర్వతగిరి : మండలంలోని అనంతారం మాజీ సర్పంచ్ మేకిరి సుశీల (74) గుండెపోటుతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో బుధవారం రాత్రి మృతి చెందింది. ఆమె 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా ప్రజలకు ఎనలేని సేవలు అందించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. ఈ క్రమంలో ఆమె చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై మృతి చెందింది. ఆమె భర్త రాజేశ్వర్ కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి ..

వర్ధన్నపేట : పట్టణంలోని ఆల్ఫోర్స్ హైస్కూల్‌సమీపంలో టైరు పగిలి అదుపు తప్పిన కారు ఆటోను, మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన ఘటనలో గాయపడి వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాయపర్తి మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన రామారపు రాములు (79) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్ తెలిపారు.

బైక్ ఢీకొని యువతికి గాయాలు

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన ఐత సంధ్య అంబేడ్కర్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా గురువారం బైక్ ఢీకొట్టగా ఆమె స్వల్ప గాయాలపాలైంది. ప్రమాదానికి కారణమైన బైక్‌పై ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్నారని, బైక్ ఆపకుండా వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. సంధ్య స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది.

సబ్‌సెంటర్ల నిర్మాణంలో నిర్లక్ష్యం

● వైద్యం కోసం రోగుల వెతలు



మనుబోతులగడ్డలో అసంపూర్తిగా ఉన్న సబ్‌సెంటర్ భవనం

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డ, ధర్మరావుపేట, బుధరావుపేట గ్రామాల్లో చేపట్టిన హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో నాటి ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణానికి రూ.16 లక్షలు చొప్పున మంజూరు చేసింది. ఒక్కో గ్రామం నుంచి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుమారు 50 మంది వరకు రోగులు వివిధ అనారోగ్య సమస్యలతో వస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణాలు పూర్తి చేస్తే స్థానికంగా పల్లె దవాఖానాలు అందుబాటులోకి వచ్చి రోగులకు స్థానికంగానే వైద్యం అందే అవకాశం ఉంటుంది.

నిలిచిపోయిన పనులు

2021–22 ఆర్థిక సంవత్సరంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు భవన నిర్మాణాలు చేపట్టారు. మూడు గ్రామాల్లోనూ స్లాబ్ స్లాబ్ వరకు పూర్తి చేశారు. అనంతరం పనులను నిలిపివేశారు. బిల్లులు సైతం మంజూరైనట్టు సమాచారం. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పనులు వదిలేయడంతో బుధరావుపేట, మనుబోతులగడ్డ సబ్‌సెంటర్ల కాంట్రాక్ట్‌ను అధికారులు రద్దు చేశారు. ఈ గ్రామాల్లోని భవనాల నిర్మాణాలకు రీటెండర్ నిర్వహించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు.

రీటెండర్ నిర్వహిస్తాం

సబ్‌సెంటర్ల నిర్మాణాలు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. మనుబోతులగడ్డ, బుధరావుపేట సబ్‌సెంటర్ల నిర్మాణానికి రీటెండర్ నిర్వహిస్తాం. త్వరలోనే భవనాల నిర్మాణ పనులు మొదలయ్యే దిశగా చొరవ తీసుకుంటాం. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం.

– రత్నాకర్, ఏఈ

వర్షాకాలంలో ఇబ్బందులు

ఏటా వర్షాకాలంలో విషజ్వరాలతో మనుబోతులగడ్డ, ధర్మరావుపేట, బుధరావుపేట గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు తప్పవు. దోమలు, ఈగలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడడం సహజం. గ్రామాల్లోని పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయని పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏటా వర్షాకాలం నాలుగు నెలల్లో పలువురు ఆస్పత్రుల పాలై ఆర్థికంగా, శారీరకంగా చితికిపోవడం ఈ గ్రామాల్లో పరిపాటిగా మారింది. గత ప్రభుత్వ హయాంలో సుదీర్ఘ ప్రయత్నాల ఫలితంగా మంజూరైన హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

బోగస్ మాటలకే ఉత్తమ్ పరిమితం



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

● నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : క్షేత్రస్థాయి పర్యటనలు చేయకుండా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బోగస్ మాటలకే పరిమితం అయ్యాడని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధాన్యం కొనుగోలులో చిత్తశుద్ధి లేదన్నారు. ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి అధికారులు కనీసం క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. కొందరు కాంగ్రెస్ నాయకులు మిల్లర్లతో సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కార్యకర్తలకు కొనుగోలు కేంద్రాలు ఎలా ఇచ్చారో కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీఓ, డీఎస్‌ఓ, డీఎం సమాధానం చెప్పాలన్నారు. సహకార సంఘాలకు, ఎఫ్‌పీఓలకు చెందాల్సిన కొనుగోలు కేంద్రాల కమీషన్ కాంగ్రెస్ నాయకుల ఖాతాల్లోకి వెళ్లే పరిస్థితి నెలకొందని చెప్పారు. ఎమ్మెల్యే పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. సన్నాలకు బోనస్ అందలేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు వేజెళ్ల కిషన్‌రావు, బంధారపు శ్రీనివాస్, నాగార్జున్ రెడ్డి, బోడ పూలు, మస్తాన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జీవ జాతులను కాపాడుకోవాలి

● ఆర్డీఓ ఉమారాణి



నర్సంపేట : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ ఉమారాణి, తదితరులు

నర్సంపేట : అంతరించిపోతున్న జీవ జాతులను కాపాడుకోవాలని స్థానిక ఆర్డీఓ ఉమారాణి కోరారు. పట్టణంలోని తన కార్యాలయంలో జీవవైవిధ్య పరిరక్షణ వాల్‌పోస్టర్లను గురువారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ జీవవైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ జీవవైవిధ్యంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రతిభ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ ఏటా జీవ వైవిధ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచందర్‌రెడ్డి, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, ఏఎస్‌ఆర్ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్, వలంటీర్ కాసుల వెంకటాచారి, వెంకన్న, ఆఫీస్ ఇన్‌చార్జ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని పాకాలలో ఔల్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ వేడుకలకు ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్, జీవవైవిధ్య శాస్త్రవేత్త షేక్ హుస్సేన్ అతిథులుగా హాజరై మాట్లాడారు. భారతదేశం జీవవైవిధ్యానికి నిలయమని చెప్పారు. దేశంలో సీతాఫలాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. అనంతరం ఔల్స్ సంస్థ ఆధ్వర్యంలో పలువురికి జ్ఞాపికలు అందజేశారు. జీవవైవిధ్య సంరక్షణపై అవగాహన కల్పించేలా ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఔల్స్ సంస్థ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఎఫ్‌ఆర్‌ఓలు సుష్మ, వేణుగోపాల్, డీఆర్‌ఓ రీన, ఔల్స్ సంస్థ జాయింట్ సెక్రటరీ రవిబాబు, బీట్ ఆఫీసర్ రమేశ్, వన సేవా సంస్థ బాధ్యుడు నరేశ్, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు కాసుల రవికుమార్, బెజ్జంకి ప్రభాకర్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి'



నర్సంపేట : నిరసన తెలుపుతున్న నాయకులు

నర్సంపేట : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఎలకంటి రాజేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అక్కపెల్లి రమేశ్, తెలంగాణ ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు కుమారస్వామి, సీపీఎం నాయకుడు బాలకృష్ణ, టీపీవీ నాయకులు మల్లేశం డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ ఆ పార్టీల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజేందర్, రమేశ్, కుమారస్వామి, బాలకృష్ణ, మల్లేశం మాట్లాడారు. మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి కేశవరావు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం వెళ్లగా పట్టుకొని ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల తిరుపతి, కృష్ణ, గొర్రె ప్రదీప్, పూలక్క, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయించాలి

వర్ధన్నపేట : ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తుల చేత విచారణ చేయించాలని ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాసు కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టు నేతలను అరెస్టు చేయకుండా ఎదురుకాల్పుల పేరుతో చంపివేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తెలిపారు.

జీలుగ విత్తనాలతో భూసార పరిరక్షణ

● మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు



రైతులకు జీలుగ బస్తాలు అందజేస్తున్న వైస్‌చైర్మన్ హరిబాబు, ఏఓ శ్రీనివాస్

ఖానాపురం : జీలుగ విత్తనాలతో భూసార పరిరక్షణ జరుగుతుందని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ తెలిపారు. మండలానికి చెందిన పలువురు రైతులకు వారు గురువారం సబ్సిడీపై జీలుగ విత్తన బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీలుగ విత్తనాలను భూమిలో కలియదున్నితే కుళ్లిపోయి సేంద్రీయ నత్రజని విడుదలై భూసార పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. అర్హులైన రైతులకు 50 శాతం రాయితీపై రూ.2137కు 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు ఆధార్, పట్టా పాస్‌బుక్కుతో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ సెంటర్ బాధ్యుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రబెల్లిపై తప్పుడు ప్రచారం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహనాయక్

రాయపర్తి : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై కాంగ్రెస్ పార్టీ నాయకుల తప్పుడు ప్రచారం సరికాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు కాంగ్రెస్ నాయకులు బుధవారం తొర్రూరులో మాజీ మంత్రి దయాకర్ రావుపై అవాకులు చెవాకులు పేలారని చెప్పారు. దయాకర్‌రావు ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిచినపుడు ఝాన్సీరెడ్డి, యశస్వినిరెడ్డి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. సదరు నాయకులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి మెజార్టీ సాధించాలని సవాల్ విసిరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు కంది ప్రభాకర్, గారె నర్సయ్య, చిన్నాల లక్ష్మీనారాయణ, గజవెల్లి ప్రసాద్, గబ్బెట యాకయ్య, బాషబోయిన సుధాకర్, రాము, చందు సతీశ్, చిలువేరు సాయి, మైస వెంకటేశం, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

'సఖి' సేవలను వినియోగించుకోవాలి

సంగెం : మహిళలు, బాలికల భద్రత, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న సఖి కేంద్రాల్లో అందుతున్న సేవలను వినియోగించుకోవాలని కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న కోరారు. మండల కేంద్రంలోని సమాఖ్య కేంద్రంలో, నల్లబెల్లిలో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. సఖి కేంద్రం ద్వారా బాధితులకు కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయంతోపాటు తాత్కాలిక వసతి లభిస్తాయని తెలిపారు. కేంద్రం రాత్రింబవళ్లు అందుబాటులో ఉంటుందని చెప్పారు. వృద్ధులు ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 14567కు ఫోన్ చేస్తే సహాయం అందుతుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు హెల్ప్‌లైన్ నంబర్ 181, 1098కు సమాచారం అందించి సాయం పొందాలని సూచించారు.

'మిల్లులకు ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం'

సంగెం : కాంటా అయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ తెలిపారు. మండలంలోని కాపులకనిపర్తి సొసైటీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి సమస్యలను అధ్యయనం చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై తాలు, తరుగు పేరుతో క్వింటాకు 5 కిలోల చొప్పున దోచుకుంటున్నారని ఆరోపించారు. కొన్ని చోట్ల తేమ పేరుతో ధాన్యం నిల్వలు కొనుగోలు చేయకుండా ఉంచుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కాంటా అయిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, సన్నధాన్యానికి బోనస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కన్వీనర్ గోనె రాంచందర్, నాయకులు జక్క అశోక్, సాంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఆర్' ఆధ్వర్యంలో ఆర్థికసాయం



మైలారంలో సాయం అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన పలువురికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఆర్థికసాయం అందించారు. తొలుత ఆయన ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన అబ్బాస్ అలీకి రూ.5 వేలు అందజేశారు. అనంతరం చికిత్స పొందుతున్న గబ్బెట ప్రవీణ్ సతీమణికి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోతర్ల కుమార్‌కు సాయం అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, నాయకులు లేతాకుల సుధాకర్‌రెడ్డి, గూడెల్లి వెంకటయ్య, గజవెల్లి ప్రసాద్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పక్కన ఝాన్సీరెడ్డి

రాయపర్తి : ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. మండలంలోని మొరిపిరాలలో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, వాటర్ ప్లాంట్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని చెప్పారు. నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు కృష్ణమాచార్యులు, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయాలి



నల్లబెల్లి : ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

● ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

నల్లబెల్లి: ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రాంలో నూతన సాంకేతికను ఉపయోగించి విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేయాలని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి కోరారు. నల్లబెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను శ్రీపాల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులను ఆలోచింపజేసేలా, ఆసక్తిగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ అనురాధ, ఎమ్మార్పీలు సతీశ్‌కుమార్, బద్రినాథ్, లింగమూర్తి, భిక్షపతి, వేణుగోపాలచారి, రాజిరెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకే శిక్షణ

నర్సంపేట/నర్సంపేట రూరల్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సుజన్‌తేజ అన్నారు. చెన్నారావుపేట మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల, నర్సంపేట మండలం లక్నేపల్లిలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చెన్నారావుపేట, నర్సంపేట ఎంఈఓలు బైరి సరళ, కొర్ర సారయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు రుణాలు

● యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ కమలాకర్



సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్

నర్సంపేట : వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు తక్కువ వడ్డీపై రుణాలు మంజూరు చేస్తామని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ గంట కమలాకర్ తెలిపారు. పట్టణంలోని ఆ బ్యాంకులో గురువారం నిర్వహించిన 'అగ్రికల్చర్ రైజ్' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. వరి మిల్లులు, తడి, పొడి ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, గ్రేడింగ్, ప్యాకింగ్, ఇతర వ్యవసాయ ఆధారిత చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి, అర్హత కలిగిన రైతులకు ప్రత్యేక రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి విలువ జోడించే పరిశ్రమలను ప్రోత్సహిస్తే రైతులకు మెరుగైన ధరలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆలోచనతో రుణాల ప్రక్రియను వేగవంతం చేసి సులభంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. మండలానికి చెందిన రైతులు అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థికంగా ఎగాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ మహేశ్, బ్రాంచ్ మేనేజర్ బాలాజీ, ఫీల్డ్ ఆఫీసర్ సుశాంత్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనెల రవీందర్, ఇరుకు కోటేశ్వర్, కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు దాసరి నర్సింహారెడ్డి, బ్యాంకు మిత్ర అడ్డగట్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



పనులు ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి తెలిపారు. నెక్కొండ తండ శివారులోని శంభునికుంట చెరువు కట్ట మరమ్మతు పనులను గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. శంభునికుంట చెరువు కట్ట మరమ్మతుకు ప్రభుత్వం డీ అండ్ ఎం నిధులు రూ. 6.60 లక్షలు మంజూరు చేయడంతో పనులు చేపట్టినట్టు తెలిపారు. నెక్కొండ రైల్వే ట్రాక్‌ను దృష్టిలో ఉంచుకుని కట్ట మరమ్మతు చేపడుతున్నట్లు చెప్పారు. భారీ వర్షాలకు రేల్వే ట్రాక్ తట్టుకునేలా పనులు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నాయకులు సుబ్బారెడ్డి, రావుల మహిపాల్‌రెడ్డి, చల్లా పాపిరెడ్డి, బోడ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి

● ఏడీఏ దామోదర్‌రెడ్డి



దుగ్గొండి : గిర్నిబావిలోని షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ దామోదర్‌రెడ్డి, సీఐ సాయిరమణ

నర్సంపేట : ప్రభుత్వ నిబంధనల మేరకు విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లు నిర్దేశించిన ప్రదేశంలోనే వ్యాపారం చేయాలని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుడు దామోదర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని రైతు వేదికలో విత్తన, ఎరువులు, పురుగులు మందుల దుకాణాల నిర్వాహకులకు వానాకాలం సీజన్‌కు సంబంధించి గురువారం ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు కోరిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, కొనుగోలు చేసిన విత్తనాల వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని రైతుకు బిల్లు ఇవ్వడంతోపాటు పూర్తి వివరాలు పొందుపర్చాలని, రైతు సంతకం తీసుకోవాలని, బిల్లులను భద్రపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి కృష్ణకుమార్, ఏఈఓలు అశోక్, శ్యామ్, వినయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

దుగ్గొండి/నల్లబెల్లి : దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో, నల్లబెల్లిలో పలు విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు, బిల్‌బుక్కులు, విత్తన ప్యాకెట్ల లాట్ నంబర్లు, అనుమతి పత్రాలను పరిశీలించారు. అనంతరం ఏడీఏ దామోదర్‌రెడ్డి, సీఐ సాయిరమణ మాట్లాడారు. రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో సీడ్ ప్యాకెట్‌పై వివరాలు చూసుకోవాలని సూచించారు. నాసిరకం విత్తనాలు విక్రయించినా, బ్లాక్ మార్కెట్లో అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు కృష్ణ, గోపాల్‌రెడ్డి, ఎస్సైలు గోవర్ధన్, నీలోజు వెంకటేశ్వర్లు, ఏఓలు మాధవి, బన్న రజిత, తదితరులు పాల్గొన్నారు.